క్లుప్తంగా

ఆదిత్యుడ్ని దర్శించుకున్న ఏఎస్పీ ప్రేమ్‌కాజల్



ప్రేమ్ కాజల్‌కు ఆదిత్యుని జ్ఞాపికను అందజేస్తున్న ఈవో హరిసూర్యప్రకాష్

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణస్వామి వారిని జిల్లాకు కొత్తగా నియమితులైన అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) డాక్టర్ ప్రేమ్ కాజల్ సోమవారం దర్శించుకున్నారు. ఆలయ ఈవో వి.హరిసూర్యప్రకాష్, ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మలు గౌరవ స్వాగతం పలికి అంతరాలయ దర్శనం చేయించారు. ఆలయ విశిష్టతను శంకరశర్మ ఆమెకు వివరించారు. అనంతరం వేదాశీర్వచనం, తీర్థప్రసాదాలు అందించారు. ఏఎస్పీ వెంట వన్‌టౌన్ ఎస్సై బలివాడ గణేష్ ఉన్నారు.

సెర్ప్ అడిషనల్ సీఈఓను కలిసిన ఎమ్మెల్యే



సెర్ప్ అడిషనల్ సీఈఓతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

రణస్థలం: విజయవాడలోని సెర్ప్ కార్యాలయంలో అడిషనల్ సీఈఓ విజయకుమారిని ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో పని చేస్తున్న 13 మంది సీఎఫ్‌ల సమస్యలను ప్రస్తావించారు. వీరికి 2019 నుంచి జీతాలు సరిగా అందడం లేదన్నారు. దీనిపై ఆమె సానుకూలంగా స్పందించి సమస్య పరిష్కరిస్తానని హామీ ఇచ్చారని ఎమ్మెల్యే తెలిపారు.

పౌష్టికాహారం పంపిణీ



గ్లూకోజ్ డబ్బాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: శ్రీకాకుళం నెట్‌వర్క్ ఆఫ్ పాజిటివ్ పీపుల్ సొసైటీ ఆధ్వర్యంలో న్యూ బ్లడ్ బ్యాంకు వారి సౌజన్యంతో 60 మంది దీర్ఘకాలిక వ్యాధితో బాధపడుతున్న చిన్నారులు, పెద్దలకు పౌష్టికాహారాన్ని సోమవారం పంపిణీ చేశారు. ముఖ్యఅతిథిగా హాజరైన బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి పూడి తిరుపతిరావు, న్యాయమూర్తి అట్టాడ రవి బాబ్జీ, సామాజిక కార్యకర్త మంత్రి వెంకటస్వామి చేతుల మీదుగా గ్లూకోజ్ డబ్బాలను అందించారు. న్యూబ్లడ్ బ్యాంకు ప్రతినిధి డాక్టర్ మణికంఠ, సంకల్ప ఫౌండేషన్ ప్రతినిధి మణిశర్మ, శ్రీకాకుళం నెట్‌వర్క్ ఆఫ్ పాజిటివ్ పీపుల్ సొసైటీ ప్రెసిడెంట్, కార్యవర్గ సభ్యులు సీఎస్పీ ప్రాజెక్టు సిబ్బంది ఏఆర్టీ మెడికల్ ఆఫీసర్ చక్రవర్తి, ప్రభుత్వ బ్లడ్ బ్యాంకు వైద్యులు సునీత, నికిత పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో కేజీబీవీ విద్యార్థిని ప్రతిభ



నీలిమను అభినందిస్తున్న కేజీబీవీ ప్రిన్సిపాల్, సిబ్బంది

రణస్థలం: లంకపేట కేజీబీవీలో 8వ తరగతి చదువుతున్న ఎం.నీలిమ ఇంటర్నేషనల్ కరాటే పోటీల్లో కాంస్య పతకం సాధించినట్లు పీఈటీ ఎం.పావని సోమవారం తెలిపారు. 7వ ఇంటర్నేషనల్ కరాటే పోటీలు ఆదివారం విశాఖపట్నంలో జరిగాయన్నారు. ఈ పోటీల్లో నీలిమ ఉత్తమ ప్రతిభ కనబర్చడం పట్ల కేజీబీవీ ప్రిన్సిపాల్ ఎస్.హైమవతి, సిబ్బంది అభినందించారు.

సినీ హీరో సుమన్‌కు సత్కారం



సుమన్‌ను సత్కరిస్తున్న శ్రీశయనులు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): శ్రీకాకుళం జిల్లాకు సోమవారం విచ్చేసిన సినీ హీరో సుమన్‌ను పట్టణంలోని ఓ హోటల్‌లో శ్రీశయన కార్పొరేషన్ చైర్మన్ డి.పి.దేవ్ మర్యాద పూర్వకంగా కలిసి దుశ్శాలువతో సత్కరించి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. దేవ్‌తో పాటు జిల్లా శ్రీశయన అధ్యక్షుడు మెండ శాస్త్రి, కల్లు గీత సొసైటీ అధ్యక్షుడు బారికివాడు, జిల్లా శ్రీశయన సంఘం యూత్ అధ్యక్షుడు గొండు నీలాద్రి, టెంక హేమసుందర్‌లున్నారు.

వేడి నూనెతో దాడి

ఎచ్చెర్ల క్యాంపస్: తోటపాలెంలో డ్రైనేజీ చెత్త విషయంపై ఇరు కుటుంబాల మధ్య సోమవారం ఘర్షణ తలెత్తింది. పోల శాంతమణిపై ఇంటిలో స్వీట్లు తయారుచేస్తున్న వేడి నూనెను పోల లక్ష్మి, దుర్గాప్రసాద్ విసిరారు. దీంతో శాంతమణి గాయపడ్డారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోల లక్ష్మి, దుర్గాప్రసాద్‌లపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై చిరంజీవి తెలిపారు.

త్వరితగతిన ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్లు



జి.సిగడాం: ఇళ్ల స్థలాలను రిజిస్ట్రేషన్ చేస్తున్న దృశ్యం

గార: ప్రభుత్వం లబ్ధిదారులకు ఇచ్చిన ఇంటి స్థలాలను సచివాలయాల పరిధిలో త్వరితగతిన రిజిస్ట్రేషన్లు చేపట్టాలని తహసీల్దార్ ఎం.శ్రీను అన్నారు. మండల తహసీల్దార్ కార్యాలయంలో సచివాలయ వీఆర్వోలతో సోమవారం సమావేశం నిర్వహించారు. నవరత్నాలు– ప్రాథమిక ఇళ్ల రిజిస్ట్రేషన్లు పంచాయతీ కార్యదర్శుల ఆధ్వర్యంలో మూడు రోజుల్లో పూర్తిచేయాలన్నారు. స్పందనకు వచ్చిన ఫిర్యాదులు, మ్యుటేషన్‌లు వెంటనే పూర్తి చేయాలన్నారు. సిబ్బంది సచివాలయాల్లో అందుబాటులో ఉండాలన్నారు. అనంతరం డీటీ ప్రసాదరావు, వీఆర్వోలు కలిసి తహసీల్దార్‌ను అభినందించారు.



గార:తహసీల్దార్ శ్రీనును అభినందిస్తున్న సిబ్బంది

ఇళ్ల స్థలాలపై పూర్తి హక్కులు

జి.సిగడాం: పేద ప్రజలకు మంజూరు చేసిన జగనన్న ఇళ్ల స్థలాలపై రాష్ట్ర ప్రభుత్వం పూర్తి హక్కులు కల్పిస్తుందని తహసీల్దార్ బి.రవికుమార్ అన్నారు. జి.సిగడాం గ్రామ సచివాలయంలో ఇళ్ల స్థలాలపై రిజిస్ట్రేషన్ కార్యక్రమాన్ని సోమవారం పరిశీలించారు. అన్ని సచివాలయాల్లోనూ రిజిస్ట్రేషన్ ప్రక్రియ జరుగుతుందన్నారు. వీఆర్‌ఓ భూపతి నర్సింగరావు, పంచాయతీ కార్యదర్శి తుల సీప్రసాద్ సాహు, డిజిటల్ అసిస్టెంట్ పాగిరి రాము, సిబ్బంది పాల్గొన్నారు.

అవకాశాలను అందిపుచ్చుకోవాలి



మాట్లాడుతున్న శాస్త్రవేత్త విశ్వనాథం

శ్రీకాకుళం న్యూకాలనీ: విద్యార్థులు తమకు అందివచ్చిన అవకాశాలను అందిపుచ్చుకుంటూ ఉన్నతంగా ఎదగాలని సీనియర్ పిరియాట్రిక్ ఇన్‌ఇమ్యునాలజీ శాస్త్రవేత్త గుండ విశ్వనాథం ఆకాంక్షించారు. నగరంలోని ఎల్‌ఐసీ కార్యాలయం సమీపంలోని కాకినాడ ఆదిత్య మహిళా డిగ్రీ కళాశాలలో సోమవారం విద్యార్థినులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు.

చదువుకుంటున్న సమయంలోనే విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలన్నారు. తాను ఐఐటీ రూర్కెలో పీహెచ్‌డీ పూర్తి చేశానని, జర్మనీలో కూడా పనిచేశానన్నారు. అక్కడ విధులు సంతృప్తి ఇవ్వకపోవడంతో అమెరికా హార్వర్డ్ యూనివర్సిటీలో పీహెచ్ పూర్తి చేశానన్నారు. ప్రస్తుతం అదే యూనివర్సిటీలో కరోనా వైరస్ లాంటి పాండమిక్ వ్యాధులు సంక్రమించిన సమయంలో వాటిని ఎలా ఎదుర్కోవాలో అనే అంశంపై పరిశోధన చేస్తున్నట్టు తెలిపారు. సంపాదన ముఖ్యం కాదని అవకాశాలను అందిపుచ్చుకొని ముందుకు సాగాలని సూచించారు. భయం లేకుండా ముందడుగు వేస్తేనే విజయాలు సొంతమవుతాయని అన్నారు కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ బీఎస్ చక్రవర్తి, ప్రిన్సిపాల్ కె.శివశంకర్, విద్యావేత్త జామి భీమశంకర్ పాల్గొన్నారు.

రథసప్తమికి 108 సూర్య నమస్కారాల ప్రదర్శన

శ్రీకాకుళం కల్చరల్: రథసప్తమి సందర్భంగా ఈ నెల 16వ తేదీన 108 సూర్యనమస్కారాల ప్రదర్శన ఇస్తామని ఎల్‌బీఎస్ కాలనీ మహిళల యోగా గ్రూపు ప్రతినిధి పిండి శారద సోమవారం తెలిపారు. గతంలో సూర్యదేవాలయంలో ప్రదర్శన ఇచ్చావాళ్లమన్నారు. అయితే భక్తులు అధికంగా వస్తుండడంతో ఈసారి బయట ప్రదర్శిస్తామన్నారు.

రౌడీషీటర్లలో పరివర్తన రావాలి

శ్రీకాకుళం క్రైమ్: సమాజంలో రౌడీషీటర్లగా ముద్రపడిన యువకులలో పరివర్తన రావాలని, నడవడికలో మార్పు రావాలని రెండో పట్టణ సీఐ జి.ఉమామహేశ్వరరావు అన్నారు. సోమవారం సంబంధిత పీఎస్‌లో రౌడీషీటర్లతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎస్‌ఐ హరికృష్ణ పాల్గొన్నారు.

కోలాట ప్రదర్శన విజయవంతం

శ్రీకాకుళం కల్చరల్: కళింగ వైశ్య మహిళా సంఘం ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన సహస్ర కోలాటంలో పాల్గొన్న ప్రతి సభ్యునికి ప్రత్యేకధన్యవాదాలని సంఘం అధ్యక్ష, కార్యదర్శులు మల్లా పద్మజ, లాడె శాంతి ప్రియ, ట్రెజరర్ తంగుడు జ్వాలలు అన్నారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లా వ్యాప్తంగా తరలివచ్చి ఏక రూప డ్రెస్ విధానంలో పాల్గొని సహకరించిన వారితో పాటు కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ప్రోత్సహించిన రాష్ట్ర అధ్యక్షుడు కోణార్క్ శ్రీను, కళింగ వైశ్య కార్పొరేషన్ చైర్మన్ అందవరపు సూరిబాబు, తదితర పెద్దలకు, తాము కోరిన వెంటనే వచ్చిన వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డు ప్రతినిధులు యు.కిరణ్‌కుమార్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు.

సీఐఎస్‌ఎఫ్‌కు యువతి ఎంపిక



తులసి

సారవకోట: మండలంలోని సత్రాం గ్రామానికి చెందిన ధర్మాన తులసి సీఐఎస్‌ఎఫ్ (సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్)కు ఎంపికైంది. గత నెలలో ఫలితాలు విడుదలయ్యాయి. ఈ నెల 24న బిలాయిలో రిపోర్టింగ్ చేయాలని ఉన్నతాధికారుల నుంచి కాల్ లెటర్ వచ్చినట్లు తులసి సోమవారం తెలిపారు. సీఐఎస్‌ఎఫ్‌కు మండలం నుంచి ఈమె మొదటి వ్యక్తిగా ఎంపికైంది. తులసిని తల్లిదండ్రులు ధర్మాన బంగారి, శాంతమ్మ, గ్రామస్తులు అభినందించారు.

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల విక్రయం



జి.సిగడాం: ప్రకృతి వ్యవసాయంతో సాగు చేసిన కూరగాయలను విక్రయిస్తున్న దృశ్యం

ఎచ్చెర్ల క్యాంపస్: ప్రకృతి వ్యవసాయం ద్వారా సాగు చేసిన పంటలను ఎచ్చెర్ల మండల కాంప్లెక్స్ ఆవరణలో సోమవారం రైతులు విక్రయించారు. రసాయన ఎరువులు, పరుగు మందుల లేకుండా సాగు చేపడుతున్నట్లు లీడ్ ఫార్మర్ మెట్ట ధనుంజయ తెలిపారు.



ఎచ్చెర్ల క్యాంపస్: కూరగాయలను విక్రయిస్తున్న రైతులు

జి.సిగడాం: మండల కేంద్రంలోని తహసీల్దార్, ఎంపీడీఓ, ఐకేపీ కార్యాలయాల ఆవరణంలో ప్రకృతి వ్యవసాయం ద్వారా సాగుచేసిన కూరగాయలను సోమవారం విక్రయంచారు. జగన్నాథవలస, సర్వేశ్వరపురం, మెట్టవలస, జి.సిగడాం గ్రామాల నుంచి తెచ్చిన పంటలను అమ్మకం చేశారు. ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

రాష్ట్రానికి అన్యాయం చేసిన టీడీపీ



మాట్లాడుతున్న పరమేశ్వరరావు

శ్రీకాకుళం అర్బన్: రాష్ట్రానికి గత టీడీపీ సర్కార్ అన్యాయం చేసిందని డీసీసీ అధ్యక్షుడు పేడాడ పరమేశ్వరరావు అన్నారు. శ్రీకాకుళంలోని ఇందిరా విజ్ఞాన్ భవన్‌లో సోమవారం విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా, విభజన హామీలు సాధిస్తామని, నిరుద్యోగులకు న్యాయం చేస్తామని, సంక్షేమ కార్యక్రమాల్ని అమలు చేస్తామని గత ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పిన టీడీపీ నాయకులు పాలనాకాలంలో చతికిల పడిందని ఎద్దేవా చేశారు. జిల్లాలో కాంగ్రెస్ పార్టీ బూత్ కమిటీల నిర్మాణం జరుగుతుందన్నారు. సమావేశంలో పీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు సనపల అన్నాజీరావు, పైడి నాగభూషణరావు, శ్రీకాకుళం పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు డి.గోవింద మల్లిబాబు, జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు రెల్ల సురేష్ ఉన్నారు.

లామ్ ఆఫీసర్ల సెమినార్‌కు హాజరు



అవార్డు అందుకుంటున్న వరలక్ష్మి

శ్రీకాకుళం కల్చరల్: విశాఖలోని ఓ హోటల్‌లో రెండురోజుల పాటు నిర్వహించిన లామ్ ఆఫీసర్ల శిక్షణ సెమినార్‌లో పాల్గొని పలు అంశాలపై చర్చించినట్టు జేసీఐ శ్రీకాకుళం గ్రీన్ సిటీ అధ్యక్షురాలు వరలక్ష్మి సోమవారం తెలిపారు. నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవడం, విద్యార్థుల ఆత్మహత్యల నివారణపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రసంగించినట్టు పేర్కొన్నారు. నాయకత్వం అంటే అధికారం కాదని సేవ చేసేందుకు గొప్ప అవకాశం అన్నారు. ఈ సందర్భంగా జోన్ అధ్యక్షుడు గొంప సురేష్ నుంచి అవుట్ స్టాండింగ్ పాటిస్‌పెంట్ అవార్డును అందుకున్నట్టు పేర్కొన్నారు. కార్యక్రమంలో ట్రెజరర్ లక్ష్మణరావు, సభ్యులు గీత, భ్రమరాంబిక, జేసీఐ చైర్మన్ మధుబాబు పాల్గొన్నారన్నారు.

మోడల్ టెస్ట్ పేపర్ల పంపిణీ



మోడల్ టెస్ట్ పేపర్లు చూపిస్తున్న విద్యార్థులు

మెళియాపుట్టి: పబ్లిక్ పరీక్షలకు తక్కువ సమయం ఉన్నందున విద్యార్థులు సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓలు దేవేంద్రరావు, పద్మనాభరావు అన్నారు. మండలంలోని కరజాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు ఆంగ్ల ఉపాధ్యాయుడు ఎల్.వి.చలం అందించిన మోడల్ టెస్ట్ పేపర్లను సోమవారం పంపిణీ చేశారు. అనంతరం తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. విద్యార్థులు ఇళ్ల వద్ద ఉండే సమయంలోనూ చదువుకు సమయం కేటాయించేలా బాధ్యత తీసుకోవాలన్నారు. టెస్ట్ పేపర్లలో ఉన్న సమాధానాలన్నీ ప్రతీ విద్యార్థి చదవాలన్నారు. హెచ్‌ఎం వెంకటరావు, ఎంపీటీసీ సభ్యుడు దాసరి రవికుమార్, పేరెంట్ కమిటీ చైర్మన్ రాజశేర్ తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీల భూములకు రక్షణ కల్పించాలి

మందస: మండలంలోని గిరిజన ప్రాంతాల్లోని ఆదివాసీల భూములకు రక్షణ కల్పించాలని గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి నిమ్మక అప్పన్న, ఉపాధ్యక్షులు సవర ధర్మారావు, గురునాథ్, ఫాల్గుణరావు కోరారు. ఈ మేరకు మందసలో సోమవారం ర్యాలీ నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కొండలోగాం పంచాయతీలో 110 గిరిజన కుటుంబాలు లక్ష్మీనారాయణపురం రెవెన్యూ పరిధిలో 70 ఎకరాలను ఎన్నో ఏళ్లుగా సాగు చేసుకుంటున్నారన్నారు. గిరిజనేతరులు తప్పుడు పత్రాలు సృష్టించి, ఈ భూములను కాజేయాలని ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. సాబకోట పంచాయతీలోని మాణిక్యపట్నం, సింగుపురం, బిత్తరబంద, బుడారిసింగి పంచాయతీలోని సవరపద్మాపురం, కొండలోగాం పంచాయతీలో చాపరాయివీధి తదితర ప్రాంతాల్లో గిరిజనుల భూములను గిరిజనేతరులు ఆక్రమించుకుంటున్నారన్నారు. ఇతర జిల్లాల నుంచి కూడా పెత్తందారులు మందస మండలానికి వచ్చి, భూములను ఆక్రమించుకుంటున్నారన్నారు. ఆంధ్రా–ఒడిశా సరిహద్దుల్లోని శ్మశానాలు, చెరువులు కూడా అన్యాక్రాంతమవుతున్నాయన్నారు. అధికార యంత్రాంగం స్పందించి, గిరిజనులకు న్యాయం చేయాలని కోరారు. అనంతరం వినతిపత్రాన్ని తహసీల్దార్‌కు అందజేశారు. కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.మోహనరావు, జీడి రైతు సంఘం జిల్లా కన్వీనర్ తెప్పల అజయ్‌కుమార్, సీఐటీయూ నాయకుడు పొందర దేవేంద్ర, ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు సవర మీనాక్షి, ఝాన్సీ, తిరుపతిరావు, రమణ, కూర్మారావు పాల్గొన్నారు.

కళాకారులకు పురస్కారాల ప్రదానం



పురస్కారం అందుకుంటున్న ధనుంజయరెడ్డి, ధనావతి

ఇచ్ఛాపురం రూరల్: తెలంగాణ రాష్ట్రం హనుమకొండకు చెందిన యువచైతన్య వెల్ఫేర్, విశ్వకర్మ సేవా ఫౌండేషన్ సంయుక్తంగా అందజేసే తెలుగు వెలుగు విశిష్ట కళారత్న జాతీయ పురస్కారాన్ని మండలానికి చెందిన ప్రముఖ జానపద కళాకారుడు, నంది అవార్డు గ్రహీత తిప్పన ధనుంజయరెడ్డి, ఆలిండియా కళా రంగం జిల్లా ఉపాధ్యక్షురాలు పెదిన ధనావతిలు అందుకున్నారు. ఆదివారం రాత్రి హనుమకొండలో జరిగిన స్వామి వివేకానంద నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతోత్సవాలు ముగింపు సందర్భంగా పురస్కారాలను ప్రదానం చేశారు.

కలెక్టర్‌కు అభినందనల వెల్లువ



కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎన్జీవో సంఘం ప్రతినిధులు



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న నర్సింగ్ కళాశాల సిబ్బంది



కలెక్టర్‌ను కలిసిన సాయి

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన మనజీర్ జిలానీ సమూన్‌ను సోమవారం పలువురు ప్రముఖులు కలిసి అభినందించారు. ఆంధ్రప్రదేశ్ నాన్ గజిటెడ్, గజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ రాష్ట్ర సహా అధ్యక్షులు చౌదరి పురుషోత్తమ నాయుడు, జిల్లా అధ్యక్షుడు హనుమంతు సాయిరాం ఆధ్వర్యంలో నూతన జిల్లా కలెక్టర్‌ను జెడ్పీ సమావేశ మందిరంలోమర్యాద పూర్వకంగా కలిసి అభినందనలు తెలియజేశారు. జిల్లాలో కారుణ్య నియమాకాలు, క్రమశిక్షణ చర్యల పెండింగ్ అంశాలపై సానుకూలంగా వ్యవహరించాలని విజ్ఞప్తి చేశారు. అసోసియేషన్ ప్రతినిధులు కంట జయరాం, గోవింద్ పట్నాయక్, దుబ శశిభూషణరావు, బడగల పూర్ణచంద్రరావు, బి.శ్రీనివాసరావు, నవీన్, మధు, తారక్ ఉన్నారు.

నర్సింగ్ కళాశాల సిబ్బంది..

జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్‌ను స్పందనలో గవర్నమెంట్ కాలేజీ ఆఫ్ నర్సింగ్ సిబ్బంది కలిసి సత్కరించారు. ఈ సందర్భంగా సింగుపురంలో నిర్మాణంలో ఉన్న కళాశాలను త్వరితగతిన పూర్తిచేయడానికి చొరవ చూపాలని కోరారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఈట కళావతమ్మ, టీచింగ్ సిబ్బంది ఉష పన్నాగవేణి, హరిప్రియ, బోధనేతర సిబ్బం ఉన్నారు.

జిల్ ఫౌండేషన్ ప్రతినిధి..

జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్‌ని తన చాంబర్‌లో జిల్ ఫౌండేషన్ వైస్ ప్రెసిడెంట్ జాడ సాయి కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు.

ఏఎస్పీ విఠలేశ్వర్‌కు సన్మానం



విఠలేశ్వర్ దంపతులను సత్కరిస్తున్న స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు

శ్రీకాకుళం అర్బన్: జిల్లా అడిషనల్ ఎస్పీ (క్రైమ్)గా పనిచేసి బదిలీపై వెళ్తున్న టి.వి.విఠలేశ్వర్ సేవలు అభినందనీయమని స్వచ్ఛందసంస్థల ప్రతినిధులు కొనియాడారు. స్థానిక 80 అడుగుల రోడ్డులోని బృందావన్ ప్యాలెస్‌లో ఆదివారం రాత్రి అభినందన కార్యక్రమం నిర్వహించారు. లయన్స్‌క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ అధ్యక్షుడు పొన్నాడ రవికుమార్, స్వచ్ఛందసంస్థల ప్రతినిధులు మాట్లాడుతూ.. వ్యక్తిత్వం ఉన్నటువంటి విఠలేశ్వర్ వంటి వాళ్లు చాలా అరుదుగా ఉంటారన్నారు. వ్యక్తిత్వాన్ని నిర్మించుకోవడానికి అధికారం, చదువు ముఖ్యం కాదని సంస్కారం ముఖ్యమన్నారు. అనంత భారతి ఆర్ష విజ్ఞాన వాటిక, భాస్కర భట్ల శ్రీరామ శర్మ, శిష్య బృందం, లయనజంస క్లబ్ హర్షవల్లి, పతంజలి యోగ సాధకులు, రోటరీ క్లబ్, బ్లూ డార్ట్, జేసీఐ తదితర సంస్థల ప్రతినిధుల ఆధ్వర్యంలో విఠలేశ్వర్ దంపతులను సత్కరించారు. లయన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ మెంటార్ నటుకుల మోహన్, జోన్ చైర్‌పర్సన్ డాక్టర్ బాడాన దేవభూషణరావు, వైస్ ప్రెసిడెంట్ ప్రొఫెసర్ డి.విష్ణుమూర్తి, సెక్రటరీ రాంగోపాల్, సభ్యులు ఉమాకవి, పొడుగు చరణ్, కామేష్, తెలగ సంఘం అధ్యక్షుడు ద్వారపు అజిత్ కుమార్, ఇలపండ వేణుగోపాల్ పాల్గొన్నారు.

'ఎండీఎం కార్మికుల సమస్యలు పరిష్కరించాలి'

శ్రీకాకుళం న్యూకాలనీ: మధ్యాహ్న భోజన పథకంలో పనిచేస్తున్న కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు, జిల్లా ఉపాధ్యక్షురాలు అల్లు మహాలక్ష్మి, కె.నాగమణి, మధ్యాహ్న భోజన పథక యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.ఉత్తర కోరారు. శ్రీకాకుళంలోని డీఈఓ కార్యాలయం వద్ద సోమవారం మధ్యాహ్న భోజన కార్మికులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్యాస్‌ను ప్రభుత్వమే సరఫరా చేయాలని, పథకం అమలుకు కనీస మౌలిక సదుపాయాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. తమకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ధర్నాలో సీఐటీయూ ఉపాధ్యక్షులు కె.సూరయ్య, నాయకులు ప్రకాష్, ఎండీఎం జిల్లా నాయకులు వి.లక్ష్మి, మంగమ్మ, ఉమ, ఊర్మిల, కౌసల్య, దమయంతి, లక్ష్మి, అమ్మాజమ్మ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నియామకాలు రద్దు చేయాలి



ధర్నా చేస్తున్న దళిత సంఘాల ప్రతినిధులు

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో పూర్వపు వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ నిమ్మ వెంకటరావు రిలీవ్ అయ్యే ముందు నియమించిన 34 ఔట్ సోర్సింగ్ పోస్టులను రద్దు చేయాలని దళిత సంఘాల ప్రతినిధులు, జాయింట్ యాక్షన్ కమిటీ సభ్యులు సోమవారం వర్సిటీ ముందు ధర్నా చేశారు. అక్రమ నియామకాలపై విచారణ చేయాలని, రూలాఫ్ రిజర్వేషన్‌కు సంబంధించిన రోస్టర్‌ను బయటపెట్టాలని, గత వీసీ కాలంలో నియామకాల జాబితా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. దీనిపై తక్షణమే విచారణ కమిటీ వేయాలన్నారు. అనంతరం వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ కె.ఆర్.రజినిని కలిసి వినతిపత్రం అందజేశారు. సమాన్యులకు న్యాయం జరిగేవరకూ పోరాటం చేస్తామని సమాజిక న్యాయ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు కల్లేపల్లి రామ్‌గోపాల్ అన్నారు. ఈ ధర్నాలో కుల నిర్మూలన పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు మిస్కా కృష్ణయ్య, మాల మహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోనెల అప్పారావు, దళిత హక్కుల పోరాట సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎడ్లగోపి, సామాజిక న్యాయ పోరాట సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గాసి గణేష్, నాయకులు టంపోల రమణ, బొడ్డేపల్లి సీతారాం పాల్గొన్నారు.